ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
తమిళనాడు
TAMILNADU
బుధవారం 1 జనవరి 2025





కొత్త ఏడాదికి గ్రాండ్ వెల్‌కమ్

- రాష్ట్రంలో మిన్నంటిన సంబరాలు
- ఆలయాల్లో పూజలు... చర్చిల్లో ప్రార్థనలు
- నేతల శుభాకాంక్షలు

కిటకిటలాడిన మెరీనా తీరం

నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని నగరం చుట్టుపక్కల నుంచి లక్షలాది మంది ప్రజలు మెరీనాబీచ్‌కు వచ్చారు. తీరంలో కూర్చునేందుకు అవకాశం లేకపోయినా.. నూతన సంవత్సరాది క్షణాలను ప్రధాన రోడ్లపైనే కూర్చుని ఆస్వాదించారు. ఈ సందర్భంగా 'హ్యాపీ న్యూఇయర్' అంటూ నినాదాలు చేస్తూ, తమ సన్నిహితులకు శుభాకాంక్షలు తెలుపుకుంటూ సందడి చేశారు.



ఆలయంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న నూతలపాటి శ్రీకృష్ణ, డి.చంద్రశేఖర్ తదితరులు

టీటీడీ ఆలయంలో..

టి.నగర్ వెంకటనారాయణ రోడ్డులోని శ్రీవారి ఆలయంలో పద్మావతి అమ్మవారి సమేత వెంకటేశ్వర స్వామి వారిని ఆభరణాలు, పూలతో అలంకరించారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆలయాన్ని పూలు, తోరణాలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. బుధవారం వేకువజామున 3.30 నుంచి రాత్రి 10 గంటల వరకు శ్రీవారి భక్తులను క్యూలైన్‌ల ద్వారా దర్శనానికి అనుమతించనున్నారు. ట్రిప్లికేన్‌లో ప్రసిద్ధి చెందిన పార్థసారధి స్వామి ఆలయంలో కొత్త సంవత్సరం సందర్భంగా భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు సిద్ధం చేశారు. నగరంలో పలు ప్రాంతాల్లో ఉన్న ఆలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజలలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ప్యారీస్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆంగ్ల సంవత్సరాదికి ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అర్ధరాత్రి చలిని లెక్క చేయకుండా ఆలయాలు, ప్రార్థనా మందిరాలకు వెళ్లి నూతన సంవత్సరంలో అంతా శుభాలే జరగాలని కాంక్షిస్తూ ప్రార్థనలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల కోసం ఆలయాలు, చర్చిల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. స్టార్ హోటళ్లు, రిసార్టులు, సముద్రతీర ప్రాంతాల్లో 2025 నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ నిర్వహించిన ఈవెంట్లు సందడి చేశాయి. ప్రతీ ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో అర్ధరాత్రి ఒంటిగంట వరకు మాత్రమే సంవత్సరాది వేడుకలు నిర్వహించేందుకు పోలీసులు అనుమతించారు. చెన్నై మెరీనా బీచ్, బీసెంట్‌నగర్ ఎలియట్స్ బీచ్, నీలాంగరై బీచ్‌ల్లో భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. ముఖ్యంగా బైక్ రేస్‌లను నిషేధించి మెరీనా బీచ్ ప్రాంతంలో నిఘా ముమ్మరం చేశారు. అలాగే ఆలయాలు, చర్చిలు, పర్యాటక ప్రాంతాల్లో దాదాపు 19 వేలమందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. 425 ప్రాంతాల్లో చెక్‌పోస్టులు పెట్టి వాహనాలను తనిఖీ చేశారు. అదేవిధంగా ఫ్లైఓవర్లను సైతం మూసివేశారు. వేడుకల్లో అపశృతి జరగకుండా 30 పర్యవేక్షణా కమిటీలు పని చేశాయి. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి 1వ తేదీ ఉదయం 6 గంటల వరకు ప్రధాన రహదారుల్లో వాహనాల రాకపోకలు నిషేధించి, సబ్‌వేలను కూడా మూసివేశారు. ఇదిలా ఉండగా, కొత్త సంవత్సరంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించేలా కాంక్షిస్తూ.. గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సహా అన్ని రాజకీయ పార్టీల నేతలు ప్రజలకు శుభాకాంక్షలను తెలిపారు.

చర్చిల్లో..

నగరంలోని బీసెంట్ నగర్ అన్నై వేలాంకన్ని, శాంథోం, సైదాపేట లిటిల్ మౌంట్, సెయింట్ థామస్ మౌంట్, అంబత్తూర్‌లోని కేథలిక్స్ చర్చి, తిరుముల్లైవాయల్ తెలుగు బాప్టిస్ట్ చర్చి, పెరంబూర్ జీసెస్ మిరాకిల్ చర్చి, ప్యారీస్ ఆంథోనియార్, జెమిని సర్కిల్‌లోని కెథిడ్రల్ చర్చి, వెపేరిలోని సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చ్, పెరంబూర్‌లోని వాటర్‌బరి మెమోరియల్ బాప్టిస్ట్ చర్చ్‌లతో సహా అన్ని చర్చిల్లో అర్ధరాత్రి నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరైయ్యారు. నూతన సంవత్సరం సందర్భంగా చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించారు. 2025 కొత్త సంవత్సరంలో విశ్వశాంతిని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నాగపట్నం జిల్లాలోని వేలాంకన్ని బాసలిక, తిరుత్తురైపూండిలోని మేరిమాత ఆలయం, తూత్తుకుడి పనిమయ మాత ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.





విద్యుద్దీపకాంతుల్లో బీసెంట్‌నగర్ చర్చి - టి.నగర్ రోడ్డు

ఎవరా సార్? అంత వణుకెందుకు?

డీఎంకే నేతలను ప్రశ్నించిన ఈపీఎస్



అడయార్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాయలంలో ఓ విద్యార్థినిపై జరిగిన లైంగికదాడి కేసులో కీలక వ్యక్తిని కాపాడేందుకు డీఎంకే మంత్రులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారని, ఆ సార్ ఎవరని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ప్రశ్నించారు. రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. అత్యాచార కేసులో అనేక సందేహాలను లేవనెత్తారు. అదేసమయంలో పొల్లాచ్చి అత్యాచారఘటనపై డీఎంకే మంత్రులు చేస్తున్న ప్రచారాన్ని కూడా ఈపీఎస్ తిప్పికొట్టారు. విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటన దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైందన్నారు. ముఖ్యంగా రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానమే సుమోటాగా ఈ కేసును విచారణకు స్వీకరించి కీలక తీర్పుఇచ్చిందని, ఇందులో ముగ్గురు సీనియర్ మహిళా పోలీస్ ఉన్నతాధికారులు ఈ కేసు విచారించాలని ఆదేశించిందని గుర్తు చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన ఎఫ్ఐఆర్ కాపీలో బాధితురాలి ఫోన్ నంబరు కూడా ఉందన్నారు. బాధితురాలి వాంగ్మూలంలో 'ఆ సార్ కూడా కొద్దిసేపు ఉండు' అని అన్నారని చెప్పినట్టుగా ఉందన్నారు. ఇపుడు ప్రజలతో కలిసి తాము కూడా ఆ సార్ ఎవరు అని అడుగుతున్నామన్నారు. బాధితురాలికి న్యాయం జరగాలని, దోషులను కఠినంగా శిక్షించాలన్నఏకైక డిమాండ్‌తో పోరాటం చేస్తున్నామన్నారు. అయితే, ఆసార్‌ను రక్షించేందుకు డీఎంకేమంత్రులు, నేతలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారన్నారు. అందుకే డీఎంకే నేతలు వణికిపోతూ తమపై ఎదురుదాడికి దిగుతున్నారని ఆరోపించారు. ఈ కేసులో ఉన్నత విద్య, న్యాయ, సంక్షేమ శాఖామంత్రులు నోటికి పనిచెప్పడానికి కారణం ఏంటి? అని ఈపీఎస్ ప్రశ్నించారు. అదేసమయంలో తమ ప్రభుత్వ హయాంలో జరిగిన పొల్లాచ్చి అత్యాచార కేసును డీఎంకే నేతలు ప్రస్తావిస్తున్నారని, నిజానికి ఈ ఘటన వెలుగులోకి వచ్చిన మరుక్షణమే తాము సీబీఐ విచారణకు ఆదేశించామని ఎడప్పాడి గుర్తు చేశారు. కానీ, డీఎంకే పాలనలో మహిళలకు, విద్యార్థినిలకు రక్షణ లేకుండా పోయిందన్నారు.

శ్రీరంగంలో కోలాహలంగా పగల్‌పత్తు ఉత్సవాలు ప్రారంభం

చెన్నై, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అష్టోత్తర శత వైష్ణవ దివ్యక్షేత్రాల్లో ప్రప్రథమమైనది, భూలోక వైకుంఠంగా కీర్తిగడించిన శ్రీరంగం రంగనాథస్వామి ఆలయ వైకుంఠ ఏకాదశి వేడుకల్లో భాగంగా పగల్‌పత్తు ఉత్సవాలు మంగళవారం ఉదయం కోలాహలంగా ప్రారంభమయ్యాయి. ఈ ఆలయంలో యేడాది పొడవునా ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. వీటిలో తమిళ ధనుర్మాసం 'మార్గళి'లో తిరుఅధ్యయన ఉత్సవం పేరిట జరిగే వైకుంఠ ఏకాదశి వేడుకలు అత్యంత ప్రత్యేకమైనవి. పగల్‌పత్తు, రాపత్తు అంటూ ఈ వేడుకలు 21 రోజులపాటు నిర్వహిస్తారు. పగల్‌పత్తు ఉత్సవాల తొలిరోజైన తిరుమొళి తిరునాళ్ మంగళవారం ప్రారంభమైంది. ఆ సందర్భంగా నంబెరుమాళ్ ఉదయం 7.45 గంటలకు మూలస్థానం నుండి బయలుదేరి ఉదయం 8.30 గంటలకు అర్జున మండపానికి చేరుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల వరకు వైష్ణవపండితులు, అరయర్లు నంబెరుమాళ్ ఎదుట నాలాయిరం దివ్యప్రబంధ కీర్తనలను శ్రావ్యంగా గానం చేశారు. పగల్‌పత్తు తొలిరోజు నంబెరుమాళ్‌ముత్తంగి సేవతో భక్తులకు దర్శనమిచ్చారు. ఇదే రీతిలో పగల్‌పత్తు ప్రతిరోజూ నంబెరుమాళ్ వివిధ అలంకరణలతో అర్జున మండపంలో వేంచేసి భక్తులకు దర్శనమిస్తారు. పగల్‌పత్తు ఉత్సవంలోని పదో రోజు (జనవరి 9న) నంబెరుమాళ్ నాచ్చియార్ తిరుకోలం అని పిలిచే మోహిని అలంకారంలో భక్తులను అనుగ్రహించనున్నారు. మరుసటి రోజు వైకుంఠ ఏకాదశి ఉత్సవం అత్యంత వైభవంగా జరుగనుంది. ఆ రోజు వేకువజాము 4.15 గంటలకు నంబెరుమాళ్ మూలస్థానం నుండి బయలుదేరి 5.15 గంటలకు పరమపదవాసల్ అని పిలిచే స్వర్గద్వారం వద్ద వేంచేస్తారు. ఆ సందర్భంగా నంబెరుమాళ్ రత్నాంగి ధరిస్తారు. అదే రోజున రాపత్తు అనే తిరువాయ్‌మొళి తిరునాళ్ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. రాపత్తు వేడుకలలో పదో రోజున (జనవరి 19న) తీర్థవారి, మరుసటి రోజు నమ్మాళ్వార్ మోక్షం, సాత్రుమరై కార్యక్రమాలతో వైకుంఠ ఏకాదశి వేడుకలకు ముగుస్తాయి.. ఈ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను శ్రీరంగం ఆలయ డిప్యూటీ కమిషనర్ మారియప్పన్, ఆలయ భద్రతా విభాగం సూపరింటెండెంట్ వేల్‌మురుగన్, సూపరింటెండెంట్ వెంకటేశన్, ఇతర అధికారులు చేపడుతున్నారు.



శ్రీరంగనాథస్వామి ఆలయంలో అర్జున మండపంలో సర్వాభరణాలంకరణతో కనువిందు చేస్తున్న నంబెరుమాళ్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

3 నుంచి పొంగల్ టోకెన్ల పంపిణీ

పెరంబూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): 'పొంగల్ గిఫ్ట్' ప్యాక్ టోకెన్లపంపిణీ ఈనెల 3వ తేది నుంచి ఇంటింటికీ వెళ్లి అందించాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. పొంగల్‌పండుగ సందర్భంగా బియ్యం కార్డుదారులు, శ్రీలంకతమిళుల పునరావాస శిబిరాల్లో ఉంటున్న వారికి తలా కిలో పచ్చి బియ్యం, కిలో చక్కెర, చెరుగుగడ అందించనున్నట్లు ప్రభుత్వం జీవో విడుదల చేసిన విషయంతెలిసిందే. అలాగే, బియ్యం కార్డుదారులకు ఉచిత చీర, ధోవతికూడా ఇప్పటికే ఆయా జిల్లా కేంద్రాలకు చేరుకున్నాయి. పొంగల్ గిఫ్ట్ ప్యాక్ పంపిణీ ఈ నెల 9వ తేది నుంచి ఇవ్వనున్న నేపథ్యంలో, రేషన్ దుకాణాల వద్ద ప్రజల రద్దీని అదుపుచేసేలా వారికి టోకెన్లు అందజేయాలని, ఆటోకెన్‌లో ప్యాక్ అందించేతేది, సమయం ఉండాలని పేర్కొంది. ఈటోకెన్లను ఈనెల 3వతేదినుంచి బియ్యం కార్డుదారుల ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ సిబ్బంది అందజేయాలని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీచేసింది.

కాషాయం పులిమేవారికి తిరుక్కురళ్‌తో గుణపాఠం

డిసెంబర్ చివర్లో 'తిరుక్కురళ్ వారం' ● కన్నియాకుమారి సభలో సీఎం స్టాలిన్

చెన్నై, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తమిళులంతా పంచమవేదంగా భావించే తిరుక్కురళ్‌కు, ఆ తిరుక్కురళ్ రచయిత తిరువళ్లువర్‌కు కాషాయరంగు పులుముతున్న దుష్టశక్తులను తిరుక్కురళ్ సిద్ధాంతాలు, భావాలే వీలైనంత త్వరగా రాష్ట్రం నుండి తరిమికొడతాయని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. ఇకపై ప్రతియేటా డిసెంబర్ చివరి వారాన్ని 'తిరుక్కురళ్ వారం'గా ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించనున్నామని ప్రకటించారు. కన్నియాకుమారిలో తిరువళ్లువర్ విగ్రహ ప్రతిష్టాపన రజతోత్సవాల రెండో రోజు వేడుకల్లో త్రివేణి సంగమ ప్రాంతం వద్ద తిరుక్కురళ్‌కు సంబంధించిన తాళపత్రాలు, గ్రంథాలు, డిజిటల్ బుక్స్‌తో కూడిన ఫొటో ప్రదర్శనను మంగళవారం ఉదయం ప్రారంభించి, తిరువళ్లువర్ విగ్రహం రజతోత్సవాల సావనీర్ ఆవిష్కరించి, ఆ రజోత్సవాల స్మారక తోరణానికి స్టాలిన్ శంకుస్థాపన చేశారు. ఇదే విధంగా తిరుక్కురళ్‌పై నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను కూడా ఆయన అందజేశారు. ఇక కన్నియాకుమారి బీచ్‌రోడ్డుకు అయ్యన్ తిరువళ్లువర్ రోడ్డుగా నామకరణం కూడా చేశారు. ఈసందర్భంగా జరిగిన సభలో స్టాలిన్ మాట్లాడుతూ. కన్నియాకుమారి వద్ద తిరువళ్లువర్ విగ్రహం ప్రతిష్టాపన జరిగిన 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రజతోత్సవ వేడుకలను ఘనంగా జరపాలని తాను ప్రకటించినప్పుడు కొంతమంది స్వార్థపరులు విగ్రహానికి ఎందుకు రజతోత్సవాలంటూ యెద్దేవా చేశారన్నారు. తిరువళ్లువర్ తమిళులకు అంతర్జాతీయ గుర్తింపు లాంటివారని, తిరుక్కురళ్ తమిళుల సంస్కృతీ సంప్రదాయక చిహ్నమని, కనుకనే ఈ రజతోత్సవాలను జరుపుతున్నామన్నారు. తన తండ్రి కరుణానిధి తమిళ ప్రజలకు అందించిన ఆస్తి ఈ 133 అడుగుల ఎత్తు తిరువళ్లువర్ విగ్రహమేనని, తిరుక్కురళ్‌ను పండితులు, పామరులు అర్థం చేసుకునేలా సులభశైలిలో తాత్పర్యాలను రాసిన ఘనత కూడా ఆయనకే దక్కిందని స్టాలిన్ పేర్కొన్నారు. మైలాపూరులో తిరువళ్లువర్ ఆలయం, కోడంబాక్కం వద్ద వళ్లువర్ కోట్టమ్ నిర్మించింది కూడా కరుణానిధే నని చెప్పారు. తిరువళ్లువర్ ప్రతిపాదించిన సమసమాజ స్థాపనే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కన్నియాకుమారి వద్ద తిరువళ్లువర్ విగ్రహం ప్రతిష్టించాలని 1975లో మంత్రివర్గం తీర్మానం చేసిందని, 1990లో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, 1997లో ఆ పనులు చురుకుగా సాగి ముగిశాయన్నారు. 500 మంది శిల్పులు కలిసి రూపొందించిన ఈ విగ్రహం భావితరాలకు స్ఫూర్తి కలిగిస్తుందన్నారు.

కుమరికి మున్సిపాలిటీ హోదా...

నగర పంచాయతీగా ఉన్న కన్నియాకుమారికి మున్సిపాలిటీ హోదా కల్పించనున్నట్లు స్టాలిన్ సభికుల హర్షధ్వానాల నడుమ ప్రకటించారు. తిరువళ్లువర్ కీర్తిని చాటేలా ఆయన కొన్ని వరాలను ప్రకటించారు. ఆ మేరకు తిరువళ్లువర్ విగ్రహ ప్రాంతం, వివేకానంద స్మారక మండపానికి పర్యాటకులు వెళ్ళి రావటానికి వీలుగా మరోమూడు బోట్లను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి జిల్లాలో తిరుక్కురళ్‌పై సదస్సులు నిర్వహించేందుకు తిరుక్కురళ్ అధ్యయనం చేసిన ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తామన్నారు. ప్రతియేటా తిరుక్కురళ్ తిరుప్పనిగళ్ పేరిట సదస్సులు జరిపేందుకు ప్రతి జిల్లాకు రూ.3లక్షలు కేటాయిస్తామన్నారు. ఇకపై ప్రతియేటా డిసెంబర్ చివరి వారాన్ని 'తిరుక్కురళ్ వారం'గా ప్రకటించి ఉత్సవాలు, ప్రతియేటా తిరుక్కురళ్ విద్యార్థుల మహానాడు, ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలల్లో తిరుక్కురళ్ సూక్తులు కలిగిన బోర్డులున్నట్టే ప్రైవేటు సంస్థల కార్యాలయాల్లో అలాంటి బోర్డులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమాల్లో స్పీకర్ అప్పావు, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి , మంత్రులు దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, పెరియసామి, తంగం తెన్నరసు, సామినాథన్, ఆర్.రాజేంద్రన్, ఎంపీలు టీఆర్ బాలు, కనిమొళి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, జిల్లా కలెక్టర్ అళగుమీనా, కుండ్రక్కుడి పొన్నంబళ అడిగళార్, తమిళ సినీ గేయరచయిత వైరముత్తు, ముఖ్యమంత్రి సతీమణి దుర్గాస్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార ధ్వని

రేపటి నుంచి ఏఐ టెక్నాలజీపై శిక్షణ

పెరంబూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ, ప్రస్తుతం అగ్రగామిగా ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ ఇవ్వనుంది. ఈకాట్టుతాంగల్ సిడ్కో ఎస్టేట్‌లో ఉన్న ఐటీఐ కార్యాలయంలో ఈ నెల 2 నుంచి 4వ తేది శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు పాల్గొనవచ్చు. శిక్షణలో తక్కువ అద్దెతో ఏసీతో వసతి కల్పించనున్నారు. మరిన్ని వివరాలకు 9668102600, 7010143022 అనే నెంబర్లు, www.editn.in వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 'నేషనల్ మీన్స్-కమ్-మెరిట్ స్కాలర్‌షిప్' (ఎన్ఎంఎంఎస్)కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 24వతేది వరకు www.dge.tn.gov.in వెబ్‌సైట్‌లోదరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుతోపాటు రూ.50 ఫీజును ఆయా పాఠశాలలప్రధానోపాధ్యాయుల ద్వారా చెల్లించాలి. ఈ స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక సంబంధించిన రాతపరీక్ష ఫిబ్రవరి 22వ తేది జరగనుందని పరీక్ష శాఖ తెలిపింది.

5న మారథాన్ పోటీలు

పెరంబూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రీడాభివృద్ధి కమిషన్ ఆధ్వర్యంలో తిరువళ్లూర్ జిల్లా క్రీడా మైదానంలో ఈ నెల 5న మహిళలు, పురుషలకు వేర్వేరుగా మారథాన్ పోటీలు నిర్వహించనున్నారు. 17-25 ఏళ్లలోపున్న పురుషలకు 8 కి.మీ, మహిళలకు 5 కి.మీ, 25 ఏళ్లు పైబడిన పురుషలకు 10 కి.మీ, మహిళలకు 5 కి.మీ మారథాన్ నిర్వహించనున్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 4వ తేదిలోపు 7401703482 అనే నెంబరు సంప్రదించి పేరు నమోదుచేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

3 నుంచి గ్రూప్-4 పరీక్షకు ఉచిత శిక్షణ

పెరంబూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌పీఎస్సీ ప్రకటించిన గ్రూప్-4 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఈ నెల 3వ తేది నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు తిరువళ్లూర్ కలెక్టర్ ప్రభుశంకర్ విడుదల చేసిన ప్రకటనలో.. ఆసక్తి కల్గిన అభ్యర్థులు జిల్లా ఉపాధి వృత్తిమార్గనిర్దేశక కేంద్రం కార్యాలయంలో సోమవారంనుంచి శుక్రవారంవరకు ఉదయం10.30నుంచిమధ్యాహ్నం3.30 గంటల వరకు జరిగే శిక్షణలో పాల్గొనవచ్చు. వివరాలకు 9789714244 నెంబరు సంప్రదించవచ్చు.

నేడు ఆదివారం టైంటేబుల్‌తో సబర్బన్ రైళ్లు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం ప్రభుత్వ సెలవు రోజు కావడంతో ఆదివారం టైంటేబుల్‌తో సబర్బన్ రైళ్లు నడువనున్నాయి.చెన్నై-తిరువళ్లూర్-అరక్కోణం, చెన్నై-గుమ్మిడిపూండి-సూళ్లూరుపేట, చెన్నైబీచ్-తాంబరం-చెంగల్పట్టు మధ్య ఆదివారం టైం టేబుల్‌తో తక్కువ సంఖ్యలో సబర్బన్ రైళ్లు నడుస్తాయని దక్షిణ రైల్వే సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.

చెన్నై సెంట్రల్-లక్నో కుంభమేళా ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కుంభమేళా సందర్భంగా చెన్నై సెంట్రల్-లక్నో మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.06071 చెన్నై సెంట్రల్-లక్నో సమీపంలోని గోమతీ నగర్‌కు ఈనెల18, ఫిబ్రవరి5, మార్చి1 తేదీల్లో చెన్నై సెంట్రల్ నుంచి మధ్యాహ్నం 2.20 గంటలకు బయల్దేరే రైలుల మూడోరోజు మధ్యాహ్నం 2.15 గంటలకు గోమతి నగర్ చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.06072 గోమతి నగర్-చెన్నై సెంట్రల్ ప్రత్యేక రైలు ఈ నెల 21, ఫిబ్రవరి 8, మార్చి 4వ తేదీల్లో గోమతి నగర్ నుంచి వేకువజామున 3.45 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.55 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది.

చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌కు రెండు స్లీపర్ బోగీలు

ఐసిఎఫ్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరం-హైదరాబాద్-తాంబరం (నెం.12760/12759) చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌కు రెండు జనరల్ సెకండ్ బోగీల స్థానంలో రెండు స్లీపర్ క్లాస్ బోగీలు అనుసంధానం చేయనున్నారు. ఈ మార్పు ఈ నెల 1వ తేది నుంచి అమలులోకి వస్తుందని, ఆ ప్రకారం, ఈ రైళ్లు 1 ఏసీ ఫస్ట్ క్లాస్ కమ్ ఏసీ టూ టైర్, 3 ఏసీ టూ టైర్, 6 ఏసీ త్రీ టైర్, 8 స్లీపర్ క్లాస్, ఒక్కో జనరల్ సెకండ్ క్లాస్, సెకండ్ క్లాస్ (దివ్యాంగుల) బోగీలతో నడుస్తాయని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

గత ఏడాది 10,701 ఉద్యోగాలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది (2024) 10,701 మందిని ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు టీఎన్‌పీఎస్సీ తెలిపింది. గత ఏడాది ప్రకటించిన తేదీల ప్రకారం విజయవంతంగా పరీక్షలు నిర్వహించి, పారదర్శకంగా నియామకాలు చేపట్టామని టీఎన్‌పీఎస్సీ ప్రకటన విడుదల చేసింది.

ఉత్తర చెన్నై థర్మల్ కేంద్రంలో విద్యుదుత్పత్తి

పెరంబూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నై విద్యుత్ కేంద్రంలో 600 మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్రారంభమైంది. ఈ కేంద్రంలోని 2వ విభాగం రెండో యూనిట్‌లో బాయిలర్ ట్యూబ్ లీకేజీ కారణంగా గత నెల 22వతేదినుంచి 600మెగావాట్ల ఉత్పత్తికి అంతరాయం కల్గింది. ప్రస్తుతంమరమ్మతులు పూర్తవడంతో మంగళవారం నుంచి విద్యుదుత్పత్తి ప్రారంభమైందని అధికారులు తెలిపారు.





తిరుప్పూరులో బనియన్ల గిడ్డంగిగా మారిన శాంతి థియేటర్ - కొత్త భవన నిర్మాణం కోసం సిద్ధమవుతున్న యూనివర్సల్ థియేటర్ ప్రాంతం - బనియన్ల గిడ్డంగిగా మారిన రామ్-లక్ష్మణ్ థియేటర్

'తెర'మరుగవుతున్నాయి

కాలగర్భంలో కలిసిపోతున్న థియేటర్లు ● గోదాములుగా మారిన సినిమా హాళ్లు

చెన్నై, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కూలి పనులు చేసే నిరుపేద నుంచి ధనవంతుల వరకు అందరికీ సరిసమానమైన వినోదాన్ని పంచిపెట్టిన ప్రాంతాలే సినిమా థియేటర్లు. వెండితెరపై హీరోహీరోయిన్ల ఆటలు పాటలు, నవరసాలను చూసి ఆనందించడానికి ప్రేక్షజనం గుమికూడే ప్రాంతాలే సినిమాథియేటర్లు. నేటి మొబైల్‌ఫోన్ల యుగంలో అరచేతిలోనే ఇమిడిపోయిన సెల్‌ఫోన్‌లో చూసినా, ఈలలు వేసుకుంటూ, చప్పట్లు చరచుకుంటూ థియేటర్లలో చూసే ఆనందాన్ని ఏ పరికరమూ ఇవ్వలేవు. సాంకేతిక పరిజ్ఞానంలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకోవడం, ఫిలిమ్ రీళ్లకు తావులేకుండా డిజిటల్ సాంకేతిక సదుపాయంతో సినిమాలు తీయటం సులువై వారానికి పది పదిహేను సినిమాలు వాటి టైటిల్స్ తేటతెలుగు భాషలో పెట్టడానికి కూడా పేర్ల కొరత ఏర్పడి ఆంగ్లంలో పేర్లుపెట్టి మరీ విడుదల చేయాల్సిన దౌర్భాగ్యస్థితి కొనసాగుతోంది. కాలగమనంలో వచ్చిన ఈ మార్పులే యేడాదికి పది పదిహేను సినిమాలు ప్రదర్శించి, వాటిలో రెండు మూడు పేరున్న హీరోల సినిమాలు వందరోజులాడి భారీగా వచ్చిన కలెక్షన్లతో జోరుగా సంపాదించిన థియేటర్ల యజమానులు సినీ రంగానికే దూరమైపోతున్నారు. రాష్ట్రంలోని ప్రముఖ వాణిజ్యనగరం తిరుప్పూరులో సినీ థియేటర్లన్నీ అదృశ్యమవుతున్నాయి.

చీకటిలో గోదాములుగా...

తిరుప్పూరు జనాన్ని ఉర్రూతలూగిస్తూ వెండి తెర వెలుగులనిచ్చిన ఆ సినీ థియేటర్ల ప్రాంతాలు నేడు చీకటిలో బనియన్ల గోదాములుగా మారిపోయాయి. ఒకప్పుడు తిరుప్పూరు నగర ప్రధాన చిహ్నంగా వెలుగొందిన యూనివర్సల్ థియేటర్ గత బ్రహ్మాండమైన ఆనవాళ్లను కూడా ఎవరూ గుర్తించలేనంతగా నేలమట్టమైంది. గజలక్ష్మి థియేటర్ కూల్చివేయడంతో అక్కడ జౌళి దుకాణం వెలిసింది. పుష్పా థియేటర్ కూల్చివేసి ఎన్నో యేళ్లుగడిచినా ఆ ప్రాంతంలోని బస్టాపును 'పుష్పాథియేటర్ సెంటర్'గానే పిలుస్తున్నారు. జ్యోతి, ధనలక్ష్మి, రాగం అంటూ మరికొన్ని థియేటర్లు కూడా కూల్చివేశారు.. నటరాజ్ థియేటర్ బనియన్ల గోదాముగా మారి యేళ్లుగడిచాయి. రామ్-లక్ష్మణ్ థియేటర్ కాంప్లెక్స్ కూడా బనియన్ల గోడౌన్లగా మారాయి.

ఆ పాత సినీ సంగతులు మధురం...

ఆ కోవలోనే కొత్త బస్టాండు ప్రాంతంలోని శాంతి థియేటర్‌ను కూడా తాజాగా బనియన్ల గోదాముగా వాడుకునేందుకు నెలసరి అద్దెకిచ్చేశారు. ఈ విషయమై శాంతి థియేటర్ యజమాని వి.రంగదురై మాట్లాడుతూ 970 సీటింగ్ కెపాసిటీతో థియేటర్ నడిపామని, పదేళ్ల క్రితం వరకూ ఏ సినిమా రిలీజ్ చేసినా వారం రోజులపాటు రెట్టింపు ప్రేక్షకులు థియేటర్‌కు వచ్చేవారని, టికెట్లు దొరకకపోతే నిరాశతో తిరిగిపోయేవారని చెప్పారు. తొలినాళ్లలో అయితే ప్రఖ్యాత హీరోల సినిమాలు ప్రదర్శించేటప్పుడు ఫిలిమ్ బాక్స్‌ను రథాన్ని ఊరేగించినట్లు నగరమంతా ఊరేగించి థియేటర్ వద్దకు చేర్చేవారని, టికెట్ల కోసం క్యూలైన్లలో నిలిచేవారికి హీరోల అభిమాన సంఘాల వారే చల్లటి మజ్జిగ, పండ్ల రసాలను, స్వీట్లను పంచిపెట్టేవారని ఆనాటి పాత సంగతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. తిరుప్పూరు నగరంలోని ప్రతి థియేటర్ లోనూ 20 నుంచి 30 మంది వరకు కార్మికులు పనిచేసేవారని, రోజుకు నాలుగు ఆటలు ప్రదర్శిస్తే ఏ సినిమా అయినా సరే వారం రోజుల్లోనే లాభాల పంట పండించేదని చెప్పారు. కరోనా లాక్‌డౌన్ తర్వాత, ఓటీటీలో సినిమాలు విడుదల చేసే యుగంలోకి ప్రవేశించడంతో ఇకపై సినిమా థియేటర్లను నడపటం ఏ మాత్రం సాధ్యపడదని, ఒక వేళ సాహసించి నడిపినా, గతంలా ప్రేక్షక దేవుళ్ళను రప్పించడం వీలుపడదని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో యేళ్లతరబడి సినిమా థియేటర్లను నడిపిన వారంతా వాటిని కల్యాణమండపాలు, షాపింగ్ మాల్స్‌గా మార్చుకుని స్థిరమైన సంపాదనపై దృష్టిసారిస్తున్నారని, ఆ నాటి సినీ స్వర్ణయుగం మళ్ళీ తిరిగి రానేరాదని, ఆయన నిట్టూరుస్తూ తెలిపారు.

భవనం పైనుండి వస్తున్న దట్టమైన పొగలు





దగ్ధమైన గదులు, సామగ్రి

అగ్ని ప్రమాదంలో

వసతి గృహం దగ్ధం

చెన్నై, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మదురై పుదూరు ప్రాంతంలో మంగళవారం ఉదయం సంభవించిన అగ్ని ప్రమాదంలో ప్రైవేటు ఆస్పత్రి భవనంపై నర్సులు బసచేస్తున్న వసతిగృహం కాలిబూడిదైంది. మదురై కార్పొరేషన్ పుదూరు అళగర్‌కోవిల్ రోడ్డులో మూడంతస్థుల భవనంలో ప్రైవేటు ఆస్పత్రి ఉండేది. కొన్నేళ్ల క్రితం ఆ ఆసుపత్రిని మరోచోటుకు తరలించారు. ప్రస్తుతం ఆ భవనం మూడోఅంతస్థుపైన తాత్కాలికంగా ప్లాస్టర్‌ఆఫ్ పారిస్‌తో గదులనునిర్మించి అందులో నర్సులు కొందరికి బస కల్పించారు. ఈనేపథ్యంలో మంగళవారం ఉదయం ఆ నర్సులు బసచేస్తున్న గదులకు నిప్పంటుకుంది. ఏసీ యంత్రంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి దట్టమైన పొగలు వెలువడ్డాయి. ఆ పొగ చూసి స్థానికులు వెంటనే అగ్నిపమాకదళానికి, పోలీసులకు ఫిర్యాదుచేశారు.ఆలోగా గదుల్లో మంటలు వ్యాపించాయి. దీంతో ఆ గదుల్లో బసచేస్తున్న ఐదుగురు నర్సులను స్థానికులు కిందకు దించారు. వీరిలో ఓనర్సు తీవ్ర అస్వస్థతకు గురై సొమ్మసిల్లి పడింది. ఆమెకు ప్రాథమిక చికిత్స చేశాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదస్థలానికి మూడు ఫైరింజన్లతో వెళ్ళిన అగ్నిమాపక దళం రెండు గంటలపాటు శ్రమించి మంటలు ఆర్పారు. ఈ ప్రమాదంలో గదులలో నర్సులకు సంబంధించిన సర్టిఫికెట్లు, దుస్తులు, సామగ్రి, ఫర్నీచర్ పూర్తిగా కాలిబూడిదయ్యాయి. పుదూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

వళ్లువర్‌కోట్టమ్ వద్ద నామ్‌తమిళర్ కట్చి ధర్నా

● సీమాన్ సహా వంద మంది అరెస్టు



సీమాన్‌ను తరలిస్తున్న పోలీసులు

చెన్నై, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థినిపై జరిగిన అత్యాచారాన్ని ఖండిస్తూ వళ్లువర్‌కోట్టమ్ వద్ద పోలీసుల అనుమతి లేకుండా నామ్ తమిళర్ కట్చి కార్యకర్తలు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనలో పాల్గొనేందుకు వచ్చిన ఆ పార్టీ నేత సీమాన్‌ను పోలీసులు నిర్బంధించారు. అనుమతి లేకుండా ప్రదర్శన చేయకూడదని సీమాన్ సహా పార్టీ కార్యకర్తలందరినీ సమపంలోనే ఉన్న కల్యాణమండపానికి తరలించారు.

బాంబు బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ఐసిఎఫ్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆలయానికి బాంబు బెదిరింపు చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వడపళని మురుగన్ ఆలయంలో బాంబు ఉంచినట్లు గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం పోలీస్ కంట్రోల్ రూంకు ఫోన్ చేశాడు. దీంతో, పోలీసులు, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో అక్కడకు చేరుకుని ఆలయం, పరిసర ప్రాంతాల్లో పరిశీలించి, బాంబు బెదిరింపు ఫేక్ కాల్‌గా నిర్ధారించారు. ఫోన్ నెంబరు ఆధారంగా విచారించిన పోలీసులు, పాలిటెక్నిక్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న తరమణికి చెందిన వివేక్‌మారన్ మద్యం మత్తులో ఈ ఫోన్‌చేసినట్టు తెలుసుకొని, అతనిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

తూటా దూసుకెళ్లి బాలుడికి గాయాలు

ఐసిఎఫ్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): దిండుగల్‌లో ఎయిర్‌గన్ తూటా దూసుకెళ్లి 17 ఏళ్ల బాలుడికి గాయాలయ్యాయి. నత్తం పెరియమలయూర్ ప్రాంతానికి చెందిన చిన్నస్వామి-సుశీల దంపతులు తమ కుమారుడు రఘుపతి (17)తో కలసి నెలరోజులుగా చిరుమలై సమీపం తెన్‌మలైలోని ఓ ఎస్టేట్‌లో ఉంటూ ఉద్యోగం చేస్తున్నారు. రఘుపతి ప్లస్ వన్ చదువుతున్నాడు. ఈ నెల 28న రఘుపతి, అదే ఎస్టేట్‌లో పనిచేస్తున్న కార్మికుడి 10 ఏళ్ల కుమారుడితో కలిసి ఎస్టేట్ యజమాని ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో ఎస్టేట్ యజమాని ఇంటినుంచి ఎయిర్ గన్ తీసుకొచ్చిన పదేళ్ల బాలుడు దానిని రఘుపతికి ఇచ్చి ఆడుకుంటుండగా బాలుడు ట్రిగ్గర్ నొక్కడంతో రఘుపతి కడుపులో తూటా దూసుకెళ్లింది. తుపాకి శబ్దం విని చుట్టుపక్కల వారు వెళ్లి రఘుపతిని దిండుగల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

రూ.3.5 కోట్ల విదేశీ సిగిరెట్లు స్వాధీనం

ఐసిఎఫ్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక హార్బర్‌లో రూ.3.5 కోట్ల విలువైన విదేశీ సిగిరెట్లను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ హార్బర్‌కు విదేశాల నుంచి పలు రకాల వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలతో నౌకలు వస్తుంటాయి. ఈ నేపథ్యంలో, దుబాయ్ నుంచి వచ్చిన కంటైనర్‌లో విదేశీ సిగిరెట్లు దిగుమతయినట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో, దుబాయ్ నుంచి వచ్చిన కంటైనర్లను తనిఖీ చేసిన అధికారులు, ఓ కంటైనర్‌లో 19.8 లక్షల విదేశీ సిగిరెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సిగిరెట్ల ధర బహిరంగ మార్కెట్లో రూ.3.5 కోట్లు ఉంటుందని, కేరళ రాష్ట్రానికి చెందిన ఓ వ్యాపారి దిగుమతి చేసుకుంటున్నట్లు అధికారుల ప్రాథమిక విచారణలో తెలిసింది. ఇదిలా ఉండగా ఆగస్టు నెలలో కూడా రూ.1.92 కోట్ల విలువైన 87.17 లక్షల సిగిరెట్లు అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

బయల్పడిన కాలభైరవుడి విగ్రహం



ప్యారీస్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా తిరుచిరంపాళెం సమీపంలోని మదతిక్కడు గ్రామంలో కాలభైరవుడి రాతి విగ్రహం లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే మదతిక్కడు గ్రామంలోని పంటకాలువకు ఆనుకుని ఉన్న ఇసుక దిబ్బల్లో స్థానిక రైతులు తేగలు సాగుచేస్తున్నారు. పెరిగిన తర్వాత తేగలను బయటికి తీసి విక్రయిస్తారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం ఆ గ్రామానికి చెందిన మురుగేశన్ అనే రైతు తేగల కోసం తవ్వుతుండగా ఆ గుంతలో నల్లటిరాతి విగ్రహం కనిపించింది. ఆ విషయం తెలిసి అక్కడికి చేరుకున్న గ్రామస్థులు 1.5 అడుగుల విగ్రహాన్ని బయటికి తీసి పరిశీలించారు. అది కాలభైరవ మూర్తి విగ్రహంగా గుర్తించి లభ్యమైన స్థలంలో పూజలు చేశారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు భువనేశ్వరి, విఘ్నేష్ అక్కడికి చేరుకుని గ్రామస్థుల నుండి విగ్రహాన్ని స్వాధీనం చేసుకుని తంజావూరు పురావస్తు శాఖ అధికారులకు అప్పగించారు.

వర్సిటీలో ఆ రోజు రాత్రి ఏం జరిగింది?

● బాధితురాలిని ప్రశ్నించిన మహిళా కమిషన్

చెన్నై, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ విద్యార్థిని అత్యాచారానికి గురైన సంఘటనపై జాతీయ మహిళా కమిషన్ విచారణ ప్రారంభించింది.. సోమవారం అన్నా విశ్వవిద్యాలయంలో ఆ కమిషన్ సభ్యులు మమతా కుమారి, ప్రవీణ్ దీక్షిత్ అధ్యాపకులు, విద్యార్థులు, ఉద్యోగులను విచారణ జరిపారు. మంగళవారం బాధితురాలిని, ఆమె తల్లిదండ్రులను, ఆమె ప్రియుడిని కూడా విచారణ జరిపారు. ఈ వివరాలన్నింటికీ రాతపూర్వకంగా నమోదు చేసుకున్నారు. తరువాత పోలీసుల ఎఫ్ఐఆర్‌లోని వివరాలు, బాధితురాలు తెలిపిన వివరాలను సరిచూశారు.

డీజీపీ సహా అధికారులతో భేటీ...

ఇదిలా ఉండగా హోంశాఖ అదనపు కార్యదర్శి ధీరజ్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి వలర్మతి, డీజీపీ శంకర్ జివాల్, గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్ తదితర అధికారులు మహిళా కమిషన్ సభ్యులను కలుసుకున్నారు. ఆ సందర్భంగా పోలీసు కమిషనర్ ఆంగ్లంలో, హిందీలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను వారికి వివరించారు. విచారణ పూర్తి చేసిన జాతీయ మహిళా కమిషన్ సభ్యులు ఢిల్లీకి పయనమయ్యారు. ఒకటి రెండ్రోజుల్లో తమ విచారణకు సంబంధించిన నివేదికను కమిషన్ ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు.

చెన్నైలో అధికమవుతున్న 'డయేరియా'

● మదురైలో నిమోనియా ● భయంవద్దంటూ మంత్రి ప్రకటన

చెన్నై, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవన ప్రభావిత వర్షాలు ముగిసిన తర్వాత రాష్ట్రంలో విరేచనాలు, నిమోనియా జ్వరాలు అధికమవటం సహజమే కనుక ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. నగరంలో 40 శాతం మంది విరేచనాలనుతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇదే విధంగా మదురై నగర పరిసర ప్రాంతాల్లో 5 నుంచి 17 యేళ్లలోపువారికి వాక్కింగ్ నిమోనియా వ్యాపిస్తోందని చెప్పారు. విరేచనాలతో బాధపడుతున్నవారికి, మదురైలో నిమోనియాతో బాధపడుతున్నవారికి అవసరమైన మందులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్నాయని, రోగులు ఆసుపత్రులకు వెళ్ళి వైద్యులిచ్చే మందులు వాడితో ఉపశమనం కలుగుతుందని మంత్రి సుబ్రమణ్యం తెలిపారు.



కామరాజ్ (ఫైల్‌ఫొటో)

దివంగత నటి చిత్ర తండ్రి ఆత్మహత్య

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): బుల్లితెర నటి దివంగత చిత్ర తండ్రి కామరాజ్ (64)మంగళవారం ఆత్మహత్య చేసుకున్నారు. ఈయనకు భార్య ఉన్నారు. తిరువాన్మియూరు రాజాజీనగర్‌లోఉన్న ఇంటిలోనే ఆయన ఉరేసుకున్నారు. 2020 డిసెంబరులో బుల్లితెర నటి చిత్ర పూందమల్లిలోని ఓ హోటల్‌లో అనుమానాస్పదంగా మృతిచెందిన విషయం తెల్సిందే. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి, చిత్ర భర్త సహా పలువురిని అరెస్టు చేయగా, నిందితులను కోర్టు నిర్దోషులుగా విడుదల చేసింది. ఇదిలావుంటే, చిత్ర తండ్రి కామరాజ్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీస్ శాఖలో ఎస్ఐగా పనిచేసిన ఈయన 2019లో పదవీ విరమణ చేశారు. ఈయన ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, కామరాజ్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాగా భర్త మృతిపై విజయ మాట్లాడుతూ, 'తమ కుమార్తె చిత్ర మృతి కేసులో నిందితులను తిరువళ్లూర్ కోర్టు నిర్దోషులుగా విడుదల చేసినప్పటి నుంచి తన భర్త అనారోగ్యానికి గురయ్యారు. మంగళవారం వేకువజామున 4 గంటల వరకు ఆయన బాగానే ఉన్నారు. ఆ తర్వాత చిత్ర గదికి వెళ్ళి ఆత్మహత్య చేసుకున్నారని బోరున విలపిస్తూ చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు

● కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

పెరంబూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అన్నా యూనివర్సిటీ విద్యార్థినిపై జరిగిన అత్యాచారం వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించిన వేలూరు కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటుపడింది. అన్నా వర్సిటీ ప్రాంగణం పరిధిలో విద్యార్థినిపై అత్యాచారం ఘటన ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ అఘాయిత్యానికి పాల్పడిన జ్ఞానశేఖరన్ అరెస్ట్ చేసిన నేపథ్యంలో, అతను డీఎంకే పార్టీకి చెందినవాడని, ఈ ఘటనతో సంబంధాలున్న మరో వ్యక్తిని ప్రభుత్వం దాచిపెడుతోందనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో, వేలూరు జిల్లా గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అన్బరసన్ అత్యాచారం ఘటనపై విమర్శిస్తూ పోస్ట్ చేశారు. దాని ఆధారంగా, యూనిఫాం ఉద్యోగుల నిబంధనలు అతిక్రమించాడని అన్బరసన్‌ను జిల్లా పోలీసు శాఖ సస్పెండ్ చేసింది. అలగే, అన్బరసన్ పోస్ట్ చేసిన వ్యాఖ్యలు కూడా తొలగించారు.

గ్రామంలోకి ప్రవేశించిన ఏనుగు

● అదృష్టవశాత్తు తప్పించుకున్న బాలుడు



పరుగులు తీస్తున్న బాలుడు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తన వెనుకన వస్తున్న ఏనుగును చూసి బాలుడు పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్న ఘటన కృష్ణగిరి జిల్లాలో చోటుచేసుకుంది. హోసూరు సమీపం బొమ్మతాత్తనూరు గ్రామంలోకి మంగళవారం తెల్లవారుజామున అడవి ఏనుగు ప్రవేశించింది. గ్రామంలోని రోడ్డుపై నడచి వెళ్తున్న ఏనుగును కొద్దిదూరంలో వెళ్తున్న బాలుడు గమనించలేదు. చుట్టుపక్కల వారు కేకలు వేయడంతో ఏనుగును చూసిన బాలుడు భయంతో పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నాడు. ఏనుగును చూసి బాలుడు పరుగెడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. గ్రామప్రజలు బాణసంచా కాల్చి ఏనుగును అటవీ ప్రాంతంలోకి తరిమివేయగా, మళ్లీ ఏనుగు గ్రామంలోకి రాకుండా తగు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు అటవీ శాఖకు విజ్ఞప్తి చేస్తున్నారు.

నీటమునిగి ఇద్దరు బాలుర మృతి

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కడలూరు సమీపంలో నీటమునిగి ఇద్దరు బాలురు మృతిచెందిన ఘటన విషాదానికి దారితీసింది. నందవెలిలో ఉన్న చెరువులో మంగళవారం మధ్యాహ్నం శ్రీహరన్ (13), శరవణన్ బాలాజి (11) స్నేహితులతో కలసి స్నానానికి వెళ్లారు. వారు స్నానం చేస్తున్న సమయంలో ఊహించని విధంగా లోతైన ప్రాంతానికి వెళ్లి నీటమునిగారు. చుట్టుపక్కల వారు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని, ఇరువురి మృతదేహాలు వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ముంబయి ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి స్వాధీనం



రైలులో పట్టుబడిన గంజాయితో రైల్వే పోలీసులు

చెన్నై, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పూణే నుంచి కన్నియాకుమారి చేరుకున్న ముంబయి ఎక్స్‌ప్రెస్‌లో 8 కేజీల గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రాత్రి కన్నియాకుమారి స్టేషన్‌కు చేరిన ఆ రైలును పారిశుధ్య కార్మికులు శుభ్రం చేస్తుండగా అన్‌రిజర్వుడు బోగీలో ఓ పెద్ద పార్శిల్ కనిపించింది. వెంటనే కార్మికులు దానిని విప్పిచూసినప్పుడు అందులో ఎనిమిది పొట్లాలు కనిపించాయి. ఈ విషయాన్ని కార్మికులు నాగర్‌కోవిల్ రైల్వే పోలీసులకు, రైల్వే భద్రతా విభాగానికి ఫిర్యాదు చేశారు. హుటాహుటిన రైల్వే భద్రతా విభాగం అధికారులు ఆ బోగీలో లభించిన ఎనిమిది పొట్లాలను పరిశీలించగా, అందులోని మేలి రకం గంజాయి కనుగొన్నారు. పోలీసులకు భయపడి స్మగ్లర్లు 8 కేజీల గంజాయిని బోగీలోనే పారవేసి వెళ్ళి ఉంటారని రైల్వే పోలీసులు తెలిపారు.

ఉమ్రా యాత్ర పేరిట రూ.36 లక్షల మోసం

అడయార్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ముస్లిం పవిత్ర తీర్థయాత్రల్లో ఒకటైన ఉమ్రా యాత్ర పేరుతో ఓ ఏజెంట్ రూ.36.50 లక్షలు వసూలు చేసి మోసం చేశాడు. ఈ సంఘటన నగరంలో తాజాగా వెలుగు చూసింది. కోయంబత్తూరు జిల్లా ఉక్కడం, అల్ అమీన్ కాలనీకి చెందిన అమీదా (62) అనే వ్యక్తి ఉమ్రా వంటి తీర్థయాత్రలకు తీసుకెళుతుంటారు. తాజాగా ఉమ్రా యాత్రకు వెళ్ళేందుకు ఉక్కడం పరిసర ప్రాంతాలకు చెందిన 66 మంది తమ పేర్లను నమోదు చేసుకుని, అడ్వాన్స్‌గా కొంత నగదు కూడా చెల్లించారు. అలా మొత్తం రూ.36.50 లక్షల మేరకు వసూలు చేసి, చెన్నై పురసైవాక్కంలోని దాస్ ఉమ్రా సర్వీస్‌లో ఏజెంట్‌గా పనిచేసే జాఫర్ అలీ (45) అనే వ్యక్తి బ్యాంకు ఖాతాకు బదిలీ చేశారు. ఈడబ్బు తీసుకున్నాక జాఫర్‌వారిని ఉమ్రా యాత్రకు తీసుకెళ్ళలేదు కదా.. డబ్బులు తిరిగి చెల్లించలేదు. దీనిపై అమీదా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.



10న అరుణ్ విజయ్ 'వణంగాన్'

చిత్రజ్యోతి

బాలా దర్శకత్వంలో జీవీ ప్రకాష్ సంగీతంలో అరుణ్ విజయ్, రోషిణి ప్రకాష్ జంటగా నటించిన 'వణంగాన్' చిత్ర జనవరి 10వ తేదీ విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. ఇతర పాత్రల్లో మిష్కిన్, సముద్రఖని వంటి ప్రధాన తారాగాణం నటించారు. ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేయనున్నట్టు మొదట ప్రకటించగా, ఇపుడు రిలీజ్ తేదీని అధికారికంగా వెల్లడించారు. పొంగల్ రేస్‌లో అజిత్ కుమార్ నటించిన 'విడాముయర్చి', రామ్ చరణ్ - శంకర్ కాంబినేషన్‌లో రూపొందిన 'గేమ్ ఛేంజర్' ఉన్నాయి. అయితే, 'విడాముయర్చి' రిలీజ్ తేదీని మేకర్స్ ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. కానీ, పాన్ ఇండియా మూవీ గేమ్ ఛేంజర్‌ను జనవరి 10వ తేదీ విడుదల చేస్తున్నారు. అదేరోజున 'వణంగాన్'ను కూడా విడుదల చేయాలని నిర్మాతలు ప్రకటించారు.

పెళ్ళి కంటే రిలేషన్ ఇష్టం

● శృతిహాసన్



వివాహం చేసుకోవడం కంటే రిలేషన్‌లో ఉండటమే తనకు ఇష్టమని హీరోయిన్ శృతిహాసన్ స్పష్టంచేశారు. గతంలో వచ్చిన ఓ ఇటర్వ్యూలో తనకు వివాహం చేసుకునే ఉద్దేశం లేదని వ్యాఖ్యానించారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో సైతం ఇదే నిర్ణయానికి ఆమె కట్టుబడివున్నారు. 'నాకు వివాహం చేసుకోవడం కంటే రిలేషన్‌కు వెళ్ళడం ఇష్టం. జీవితంలో దేన్నికూడా అంచనా వేయలేం. అందువల్ల పెళ్ళి విషయం నాకు తెలియలేదు. నాకు రిలేషన్‌షిప్, రొమాన్స్ చేయడమంటే ఎంతో ఇష్టం. నేను ఒక రిలేషన్‌షిప్‌లో ఉండటాన్ని ఇష్టపడతాను' అని పేర్కొన్నారు. కాగా, గతంలో లండన్ ప్రియుడు శాంతను హజారికతో కొంత కాలం రిలేషన్‌లో ఉన్న విషయం తెల్సిందే. కాగా, ప్రస్తుతం శృతిహాసన్ సూపర్‌స్టార్ - లోకేష్ కనకరాజ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'కూలి' సినిమాలో నటిస్తున్నారు.

అస్తమించిన 'వినోదం'

● శాశ్వతంగా మూతపడిన ఉదయం థియేటర్



ఉదయం థియేటర్ కాంప్లెక్స్

చెన్నై నగరంలోని ప్రముఖ సినీ కాంప్లెక్స్‌ల్లో ఒకటైన ఉదయం థియేటర్ శాశ్వతంగా మూతపడింది. ఈ థియేటర్‌ను కూల్చివేసి బహుళ అంతస్తుల భవన సముదాయాన్ని నిర్మించనున్నారు. ఈ నిర్మాణ పనులకు తాజాగా శంకుస్థాపన కూడా చేశారు. 1983 మే నెలలో ప్రారంభించిన ఈ కాంప్లెక్స్‌లో ఉదయం, సూర్యన్, చంద్రన్ అనే పేర్లతో మూడు థియేటర్లు ఉండేవి. ఆ కాలంలోనే నగరంలోని ప్రముఖ సినిమా కాంప్లెక్స్‌గా గుర్తింపు పొందింది. అయితే, ఈ థియేటర్ యజమాన్యం మధ్య తలెత్తిన ఆస్తిపంపకాలు, వివాదాల కారణంగా ఉదయం థియేటర్‌ను విభజన చేసి మినీ ఉదయం పేరుతో మరో స్క్రీన్ ఏర్పాటు చేశారు. చెన్నై నగరంలో మల్టీప్లెక్స్ థియేటర్లకు పెద్దగా ఆదరణ లేని సమయం లో ఈ థియేటర్ కాంప్లెక్స్ అభిమానులకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ముఖ్యంగా 1990 దశకంలో ఈ థియేటర్ కాంప్లెక్స్ విజయ్, అజిత్ అభిమానులకు కంచుకోటగా మారింది. ఇక్కడ ప్రదర్శించిన అనేక సినిమాలు రజతోత్సవాలను జరుపుకున్నాయి. చెన్నై మహానగరంలో అత్యధిక వసూళ్ళు సాధించిన థియేటర్లలో ఒకటిగా గుర్తింపు పొందింది. అయితే, చెన్నై నగరంలో మల్టీప్లెక్స్‌ల సంస్కృతి పెరిగిన తర్వాత ఉదయం వంటి సినీ కాంప్లెక్స్‌లకు ఆదరణ తగ్గిపోయింది. అలా గత నాలుగు దశాబ్దాల సినీ సంస్కృతిలో భాగమై, అంతులేని జ్ఞాపకాలను మిగిల్చిన ఈ థియేటర్ ఇపుడు కనుమరుగు కానుండటం సినీ అభిమానులను ఒకింత కలచివేస్తుంది.

ఆ హీరోయిన్‌పై చేయి చేసుకున్నానా?

● దర్శకుడు బాల వివరణ



మమత బైజు - బాల

హీరోయిన్ మమత బైజుపై చేయి చేసుకున్నట్టు వస్తున్న వార్తలపై దర్శకుడు బాల స్పందించారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ అంశంపై ఆయన స్పందిస్తూ, 'మమత బైజు నా కుమార్తె వంటింది. అలాంటిది ఆమెపై చేయి చేసుకుంటానా? పైగా మరొకరి బిడ్డను ఎవరైనా కొడతారా? ముంబై నుంచి వచ్చిన మేకప్ ఆర్టిస్టులు మమతకు మేకప్ వేశారు. కానీ, మేకప్ నచ్చదనే విషయం వారికి తెలియదు. నా చిత్రాల్లో నటించే నటీనటులకు మేకప్ ఉండదు. ఈ విషయాన్ని చెప్పగా ఆమెకు అర్థంకాలేదు. షాట్ రెడీ అనగానే.. మేకప్‌తో కెమెరా ముందుకు వచ్చారు. ఆమెను చూడగానే నేను షాక్ అయ్యాను. మేకప్ ఎవరు వేశారు? అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ చేయి పైకెత్తాను. ఆ వెంటనే ఆమెను కొట్టినట్టుగా మీడియాలో ప్రచారం జరిగింది. లొకేషన్‌లో జరిగిన వాస్తవ విషయం ఇదే' అని దర్శకుడు బాల వివరించారు.

వైభవంగా తిరుత్తణి ఆలయ మెట్లోత్సవం



మెట్ల పూజ చేస్తున్న భక్తులు

తిరుత్తణి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయంలో మంగళవారం మెట్లోత్సవం వైభవంగా జరిగింది. ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకొని ఈ ఆలయానికి వెళ్లే 365 మెట్లకు భక్తులు పసుపు, కుంకుమ రాసి హారతులిస్తూ ఆలయానికి వెళ్లి స్వామి దర్శనం చేసుకుంటారు. మంగళవారం జరిగిన వేడుకల్లో పలు జిల్లాలు, పొరుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బుధవారం కూడా ఈ వేడుకలు జరుగనున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 300 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర రవాణా సంస్థ ప్రత్యేక బస్సులు, దక్షిణ రైల్వే ప్రత్యేక రైళ్లను నడిపింది. వేడుకల ఏర్పాట్లను ఆలయ నిర్వహణ జాయింట్ కమిషనర్ రమణి, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ శ్రీధరన్, ధర్మకర్తలు ఉషార్ రవి, మోహనన్, సురేష్‌బాబు, నాగన్, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

నేత్రపర్వంగా అంకాళపరమేశ్వరి ఊంజల్ ఉత్సవం



జగజ్జనని అలంకారంతో ఊయల్లో అంకాళపరమేశ్వరి

చెన్నై, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా మేల్‌మలయనూరు అంకాళపరమేశ్వరి ఆలయంలో మార్గళి అమావాస్యను పురస్కరించుకుని అమ్మవారి ఊంజల్ ఉత్సవం కనులపండువగా జరిగింది. ఈ ఉత్సవం సందర్భంగా సోమవారం వేకువజామునే అమ్మవారికి, పరమేశ్వరుడికి పంచామృతం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, ఆరాధనలు నిర్వహించారు. ఆ తర్వాత అమ్మవారికి స్వర్ణకవచం ధరింపజేసి దీపారాధన జరిపారు. రాత్రి 11.30 గంటలకు పంబై మేళతాళాల మధ్య పడమటి ద్వారం గుండా ఉత్సవమూర్తి అంకాళపరమేశ్వరిని ఊంజల్ మంటపానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అర్ధరాత్రి 12.30 గంటల దాకా అమ్మవారి ఊంజల్ ఉత్సవం ముగిసింది. అనంతరం అమ్మవారికి పుష్పార్చన, మహాదీపారాధన జరిపారు. ఈ కార్యక్రమాల తర్వాత అమ్మవారిని ఆలయ మండపంలోనికి తోడ్కొని వెళ్ళారు. ఈ ఊంజల్ ఉత్సవానికి విల్లుపురం, కడలూరు, సేలం, వేలూరు, తిరువణ్ణామలై, కాంచీపురం, చెన్నై నగరాల నుండి, పుదుచ్చేరి, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి వేలాదిమంది భక్తులు హాజరయ్యారు. ఈ ఉత్సవానికి విచ్చేసిన భక్తులకు సెంజి ఏఎస్పీ కార్తీకా ప్రియా నాయకత్వంలో సుమారు 600 మంది పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. రాష్ట్ర రవాణా సంస్థ పలు జిల్లాల నుంచి మేల్‌మలయనూరుకు ప్రత్యేక బస్సులను కూడా నడిపింది.

రూ.35కు చెరుకు గడ కొనుగోలు



చెరకుతోట పరిశీలిస్తున్న రాధాకృష్ణన్

ఐసిఎఫ్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పొంగల్‌కు బియ్యం కార్డుదారులకు అందించనున్న చెరుకు గడను రూ.35కు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పొంగల్ సందర్భంగా రేషన్ దుకాణాల ద్వారా బియ్యం కార్డుదారులకు కిలో పచ్చి బియ్యం, కిలో చక్కెర, ఒక చెరుకు గడ అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, చెరకు గడ కొనుగోలు ధరను ప్రభుత్వం ప్రకటించింది. ఆయా జిల్లాల రైతులను నుంచి చెరకు గడను గరిష్ఠంగా రూ.35కు కొనుగోలు చేయాలని, ఈ కొనుగోళ్లు ఆయా జిల్లాల కలెక్టర్ల పర్యవేక్షణలో చేపట్టాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇదిలా ఉండగా పౌర సరఫరాల శాఖ కార్యదర్శి డాక్టర్ రాధాకృష్ణన్ మంగళవారం గ్రామాలకు వెళ్లి ప్రభుత్వం కొనుగోలు చేయనున్న చెరకు గడలను పరిశీలించారు.

చెన్నై స్నేహితుల సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా చెల్లప్ప



నూతన అధ్యక్షుడు లయన్ చెల్లప్పను సత్కరిస్తున్న నిర్వాహకులు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి: చెన్నై స్నేహితుల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఎంజేఎఫ్ లయన్ చెల్లప్పను పలువురు ప్రముఖులు అభినందించారు. టీనగర్‌లోని ప్రైవేటు హోటల్‌లో జరిగిన కార్యక్రమానికి అరిమా జిల్లా అధ్యక్షుడు, పమ్మల్ పారిశ్రామికవేత్త లయన్ పీఆర్ఎస్ శరవణరాజ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి ఏకే మూర్తి, టీటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యులు డా.ఎస్.శంకర్, ప్రముఖ ఆక్యుపంచర్ వైద్యులు శంకర్, పసుమై తాయగం రాష్ట్ర కార్యదర్శి అరుళ్ సహా పలువురు ప్రముఖులు పాల్గొని, చెల్లప్పను అభినందించారు. అలాగే, చెన్నై గ్రీన్ సిటీ అరిమా సంఘం అధ్యక్షుడు లయన్. కన్నన్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

నేటినుంచి రామరాజ్ కాటన్ ధోతి వారోత్సవం

● సరసమైన ధరకే కాంబో ప్యాక్



కాంబో ప్యాక్‌ను పరిచయం చేస్తున్న దృశ్యం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈ నెల ఒకటో తేదీ నుంచి 7వ తేదీ వరకు కాటన్ ధోతీ వారోత్సవాన్ని రామరాజ్ కంపెనీ నిర్వహించనుంది. కల్చర్ క్లబ్ పేరుతో ఒక కలర్ చొక్కాతో కలిసి కాటన్ ధోతిని కాంబో ప్యాక్ కింద సరసమైన ధరకే విక్రయానికి అందుబాటులో ఉంచింది. నేటి యువతరంలో భారతీయ సంప్రదాయ వస్త్రధారణ, పంచె గొప్పతనాన్ని ప్రచారం చేసే నిమిత్తం ఈ వార్షిక కార్యక్రమంలో భాగంగా కాటన్ ధోతీ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు రామరాజ్ ఫౌండర్ కేఆర్ నాగరాజన్, మేనేజింగ్ డైరెక్టర్ బీఆర్ అరుణ్ ఈశ్వర్, సీఈవో కేఏ సెల్వకుమార్ మంగళవారం తిరుప్పూర్‌లో జరిగిన మీడియా సమావేశంలో పేర్కొన్నారు. ఈ కాంబో ఆఫర్ కింద ఒక కలర్ చొక్కా, పంచె రూ.695కే విక్రయిస్తామని, ఈ అవకాశం ఒక్క తమిళనాడు రాష్ట్రానికే పరిమితమని, ఈ యేడాది సంప్రదాయ దుస్తుల్లో పొంగల్ వేడుకలను ఉత్సాహంగా జరుపుకునేందుకు ఈ కాంబో ఆఫర్ సరైన ఎంపికగా వారు పేర్కొన్నారు.



కన్నియాకుమారిలో తిరుక్కురళ్‌పై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను ప్రారంభించి తిలకిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

సువైయిన్ సంగీతం' ప్రారంభం



అడయార్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రముఖ పాకశాస్త్ర నిపుణుడిగా గుర్తింపు పొందిన చెఫ్ దాము 'సువైయిన్ సంగీతం' పేరుతో ప్రీమియర్ క్యాటరింగ్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ప్రారంభించారు. ఇదే విషయంపై ఆయన మంగళవారం చెన్నైలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి వేడుకను మరుపురాని రుచులతో నిర్వహించుకునేలా చేయడమే ఈ కాన్సెప్ట్ ముఖ్యోద్దేశమన్నారు. కాగా క్యాటరింగ్‌లో నైపుణ్యానికి పేరుగాంచిన సువైయిన్ సంగీతం... ఎండ్ టు ఎండ్ ఈవెంట్ సొల్యూషన్ కూడా అందించనుంది. ముఖ్యంగా డ్రీమ్ వెడ్డింగ్‌ల కోసం క్యాటరింగ్, ఈవెంట్ ప్లానింగ్, మేనేజ్‌మెంట్, ఆడియో విజువల్ సొల్యూషన్స్ ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలను కూడా అందించనుంది.

పార్థసారథి ఆలయంలో వీల్‌చైర్లు



వీల్‌చైర్లను కానుకగా సమర్పిస్తున్న సంస్థ నిర్వాహకులు

చెన్నై, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్ల కోసం రెసిడెన్షియల్ ప్లాట్లు నిర్మించే అతుల్యా సీనియర్ కేర్ సంస్థ ట్రిప్లికేన్ పార్థసారథి ఆలయానికి రెండు వీల్‌చైర్లను కానుకగా అందజేసింది. ఈ సందర్భంగా ఆ సంస్థ వ్యవస్థాపక సీఈఓ శ్రీనివాసన్ మాట్లాడుతూ నడవలేని భక్తులు ఈ వీల్‌చైర్ల ద్వారా వెళ్ళి స్వామివారిని దర్శనం చేసుకోగలరని చెప్పారు. ఇదే రీతిలో మరిన్ని ఆలయాల్లోనూ వీల్‌చైర్లు కానుకగా సమర్పించనున్నట్లు తెలిపారు.

హస్తినకు తమిళిసై

ప్యారీస్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో భేటీకి ఆ పార్టీ సీనియర్ నాయకురాలు తమిళిసై సౌందరరాజన్ మంగళవారం ఢిల్లీకి పయనమైయ్యారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, మరో పదిరోజుల్లో అన్ని రాష్ట్రాల్లో బీజేపీకి కొత్త రాష్ట్ర అధ్యక్షులను నియమించనున్నారని, వీరిని ఎంపిక చేసేందుకు ఒక్కొక్క రాష్ట్రానికి పార్టీ సీనియర్లను అధిష్ఠానం నియమించిందని తెలిపారు. ఈ క్రమంలో అండమాన్ నికోబార్ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడ్ని ఎంపిక చేసే నిమిత్తం తాను ప్రత్యేక అధికారిగా ఢిలీ వెళ్లి పార్టీ అధినేత జేపీ నడ్డాతో సమావేశం కానున్నట్లు ఆమె తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించే విషయంలో విఫలమైందని వాఖ్యానించారు

సమాజ శ్రేయస్సే లక్ష్యం

● లయన్ తాళ్లూరి సురేష్



అన్నదానం చేస్తున్న తాళ్లూరి సురేష్, కరుణాకరన్ తదితరులు

ప్యారీస్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సే లయన్స్ క్లబ్ ఆఫ్ చెన్నై రాయల్ కింగ్స్ లక్ష్యమని, ఆ క్లబ్ ఫౌండర్ ప్రెసిడెంట్, చెన్నై పశ్చిమ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తాళ్లూరి సురేష్ పేర్కొనారు. విల్లివాక్కం భారతీనగర్ రెండో వీధిలోని మొప్పిలియమ్మాళ్ ఆలయంలో 2025 నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ మంగళవారం ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. లయన్ క్లబ్ ఆఫ్ చెన్నై రాయల్ కింగ్స్ ట్రెజరర్ కరుణాకరన్, సలహాదారులు మాలతీ కరుణాకరన్, చక్రవర్తి పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రత్యేక వేడుకల్లో ముఖ్యఅతిథిగా సురేష్ పాల్గొన్నారు. పేదలకు అన్నదానం చేసిన సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. సమాజం శ్రేయస్కరంగా ఉండాలనే ఆశయంతో తమ క్లబ్ తరుపున పలు సేవా, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లోని ప్రతిభను బయటికి తీసుకొచ్చేందుకు ప్రత్యేక కార్యక్రమాలను ఈ నూతన సంవత్సరంలో విస్తృతంగా జరపడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. నైతిక విలువలు, సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణపై ఆవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

అలరించిన సంగమం ఫెస్టివల్



ఉత్సవంలో ప్రముఖులు

అడయార్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నృత్యకళాకారిణి బాలా దేవి పర్యవేక్షణలో కార్తీక్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన 'సంగమం ఫెస్టివల్' ఆహూతులను అమితంగా అలరించింది. మైలాపూర్‌లోని భారతీయ విద్యా భవన్‌లో మంగళవారం ఈ నృత్య కార్యక్రమం జరిగింది. ఈ ఫెస్టివల్‌ను మూడు భాగాలుగా నిర్వహించారు. భారతీయ శాస్త్రీయ కళలు, గ్లోబల్ హార్మోనీ ద్వారా సంస్కృతులను ఏకం చేయడమే ప్రధాన లక్ష్యంగా సాగింది. ఈ ఫెస్టివల్ కళాత్మక కార్యక్రమాలకు అతీతంగా ఉంటుంది. యూఎస్ఏతో పాటు వివిధ ప్రాంతాల్లో ఈ తరహా కార్యక్రమాలను నిర్వహించి విజయవంతం చేయగా, తాజాగా నగరంలో నిర్వహించి విజయవంతం చేశారు.

కుట్రాలం జలపాతం వద్ద స్నానాలపై నిషేధం



కుట్రాలం జలపాతం వద్ద నీటి ఉధృతి

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కుట్రాలం ప్రధాన జలపాతం వద్ద నీటి ఉధృతి పెరగడంతో పర్యాటకుల స్నానాలకు అధికారులు నిషేధం విధించారు. తెన్‌కాశి జిల్లా పశ్చిమ కనుమల కొండ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కుట్రాలం జలపాతం వద్ద నీటి ప్రవాహం అధికమైంది. ప్రధాన జలపాతం వద్ద హెచ్చరిక బోర్డులకు మించి నీరు ప్రవహిస్తుండడంతో, సందర్శకులు ఆ జలపాతం వద్దకు వెళ్లడం, స్నానాలు చేయడాన్ని అటవీశాఖ అధికారులు నిషేధం విధించారు. నిబంధనలు అతిక్రమించి సందర్శకులు ఆ ప్రాంతానికి వెళ్లకుండా బ్యారికేడ్లు ఏర్పాటుచేసి, సిబ్బంది గస్తీ పనులు చేపట్టారు.



చెన్నై సెమ్మొళి పూంగాలో ఫ్లవర్‌షో ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మంత్రి తంగం తెన్నరసు



రికార్డు స్థాయిలో నృత్య ప్రదర్శన చేసిన విద్యార్థులు

తరంగంలో విద్యార్థుల రికార్డు

పెరంబూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా తారమంగళం కైలాసనాథర్ ఆలయంలో ప్రపంచ సాధన భరతనాట్యం ప్రదర్శన జరిగింది. మదురై రుద్ర నాట్యకళాక్షేత్రం ఆధ్వర్యంలో 3 నుంచి 15 ఏళ్లు కలిగిన 250 మంది విద్యార్థినులు, ఆలయ ప్రాంగణంలో తరంగం నృత్య ప్రదర్శన చేశారు. భరతనాట్యంలో మొత్తం 15 రకాల నృత్యాలు చేసి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. రెండు గంటలు ఆగకుండా విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన నోబల్ రికార్డు పుస్తకంలో నమోదైంది. దీని సర్టిఫికెట్‌ను నిర్వాహకులకు అందజేశారు. అలాగే, నృత్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు పాల్గొని, నృత్యం చేస్తున్న విద్యార్థులను కరతాళధ్వనులతో ఉత్సాహపరిచారు.



తరంగం నృత్య ప్రదర్శన


శ్రీహరి హుండీ ఆదాయం రూ.4.10కోట్లు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 11 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు.. వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2లోని 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం: రూ.4.10 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,298

తలనీలాలు సమర్పించినవారు: 15,544



కో-ఆప్‌టెక్స్‌ను లాభాల్లోకి తెచ్చాం

● హ్యాండ్‌లూమ్, టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గాంధీ



కోఆప్‌టెక్స్ షోరూం ప్రారంభోత్సవంలో మంత్రి గాంధీ తదితరులు

తిరుపతి అర్బన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): డీఎంకే అధికారంలోనే కో-ఆప్‌టెక్స్‌ను లాభాల్లోకి తెచ్చామని తమిళనాడు హ్యాండ్‌లూమ్, టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి ఆర్. గాంధీ అన్నారు. తమిళనాడు ప్రభుత్వం రూ.40లక్షలతో తిరుపతి గాంధీరోడ్డులో ఆధునికీకరించిన కో-ఆప్‌టెక్స్ షోరూంను మంగళవారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో కలిసి ఆయన ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 150 కోఆప్‌టెక్స్ షోరూంలుండగా 48 ఆధునికీకరించామని మంత్రి వివరించారు. చేనేత వస్త్రాలను ప్రజలందరూ వినియోగించాలని కోరారు.

సహకార శాఖ ఆధ్వర్యంలో అదనపు పెట్రోల్ బంకులు

పెరంబూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో 60 పెట్రోల్ బంక్‌లు ఏర్పాటుచేసేందుకు సహకార శాఖ సిద్ధమవుతోంది. ఈ శాఖ ఆధ్వర్యంలోని ట్రిప్లికేన్ సహకార సంఘం, కాంచీపురం సహకార సంఘాలు పెట్రోలియం సంస్థల పెట్రోల్ బంక్‌లు, గ్యాస్ ఏజన్సీలు నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం 54 పెట్రోల్ బంక్‌లు నడుస్తున్నాయి. ఈ క్రమంలో, సహకార సంఘాలకు పెట్రోల్ బంక్‌లు, గ్యాస్ ఏజన్సీల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని పెట్రోలియం సంస్థలకు కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ సిఫారసు చేసింది. రాష్ట్రంలోని పలు సహకార సంఘాలు 60కి పైగా పెట్రోల్ బంక్‌ల ఏర్పాటు కు దరఖాస్తు చేసుకున్నాయని అధికారులు తెలిపారు.

వరసిద్ధుడి ఆలయంలో సర్వం సిద్ధం

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడి ఆలయానికి నూతన సంవత్సరం సందర్భంగా స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జనవరి 1వ తేదీ పురస్కరించుకుని బుధవారం స్వామి వారి దర్శనార్థం ఆలయానికి సుమారు 70వేల మంది భక్తులు విచ్చేయనున్నట్లు తెలిపారు. ప్రతి భక్తుడికి స్వామి దర్శనం కల్పించేందుకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశామన్నారు.

కల్నల్ జాన్ బెన్నీక్విక్ స్మృతిచిహ్నం

కేరళలో తమిళ విద్యాలయం

● మరమ్మతుల కోసం కార్మికుల ఎదురుతెన్నులు




తేక్కడిలోని తమిళ ప్రాథమిక పాఠశాల భవనం



వరండాలో చదువుకుంటున్న చిన్నారులు

టి.నగర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): 'తమిళ కర్షక పక్షపాతి', ఆంగ్లేయ ఇంజనీర్ కల్నల్ జాన్ బెన్నీక్విక్ ముల్లై పెరియార్ డ్యామ్ నిర్మాణంలో పాలుపంచుకున్న కార్మికుల పిల్లల కోసం కేరళలో తేక్కడి ప్రాంతం వద్ద ఏర్పాటు చేసిన తమిళపాఠశాల ప్రస్తుతం దయనీయ స్థితిలో ఉంది. ఆ పాఠశాలకు మరమ్మతులు చేయాలని తేయాకు ఎస్టేట్ కార్మికులు, వ్యవసాయ కూలీలు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. కేరళలో తమిళనాడు ప్రభుత్వం నడుపుతున్న ఏకైక ప్రాథమిక పాఠశాల ఇది. ఇంతటి కీర్తి ఉన్న ఆ పాఠశాల పైకప్పు కూలిపోవటంతో విద్యార్థులు వరండాలో కూర్చుని పాఠాలు నేర్చుకుంటున్నారు. ఐదు జిల్లాలకు చెందిన అన్నదాతలు ముక్కారు పంటలను పండించేందుకు వీలుగా ఆంగ్లేయ ఇంజనీరు కల్నల్ బెన్నీక్విక్ ముల్లై పెరియార్ డ్యాం నిర్మించారు. ఆ ఆనకట్ట నిర్మాణ పనులు 1887లో ప్రారంభమై 1893లో ముగిశాయి. ఆనకట్ట నిర్మాణ పనుల కోసం రాష్ట్రం నలుమూలల నుంచి కార్మికులను తీసుకెళ్ళారు. బెన్నీక్విక్ వారికి బస సహా అన్ని వసతులను కూడా కల్పించారు. ఆ కార్మికుల పిల్లల చదువులకు ఆటంకాలు కలుగకూడదనే సత్సంకల్పంతో కేరళలోని తేక్కడి (ప్రస్తుతమున్న ఫారెస్ట్‌చెక్‌పోస్ట్ సమీపంలో) ప్రాథమిక పాఠశాల కూడా ఏర్పాటు చేసి, ఉపాధ్యాయులను నియమించి తమిళ మాధ్యమంలో పాఠాలు బోధించే ఏర్పాట్లు చేపట్టారు. అప్పట్లో ఆ పాఠశాలలో 150 మంది విద్యార్థులు చదివారు. 10మందికిపై ఉపాధ్యాయులు కూడా పనిచేసేవారు. అప్పట్లో ఈ ప్రాంతం తమిళనాడు కేరళ అనే వ్యత్యాసాలు లేకుండా మద్రాసు ప్రెసిడెన్సీ ఆధీనంలో ఉండేది. 1956లో భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటైనప్పుడు ఈ ప్రాంతాన్ని కేరళ సరిహద్దులో చేర్చారు. ఆనకట్ట నిర్మాణం పూర్తయినప్పటికీ ఆ ప్రాంతంలో పనిచేస్తున్న తేయాకు తోటల్లో పనిచేసే కార్మికులు, వ్యవసాయ కూలీలు అధికంగా అక్కడే స్థిరనివాసాలు ఏర్పరచుకోవడంతో వారి పిల్లల కోసం ఈ పాఠశాలను నడుపుతున్నారు. బెన్నీక్విక్ ఆశయాన్ని నేటికీ కొనసాగించేలా ఆ పాఠశాలను తమిళనాడు ప్రభుత్వమే నడుపుతోంది. ఈ పాఠశాలకు, తేక్కడి, రోజా పూఖండం, అంబాడి తదిత ప్రాంతాల నుండి విద్యార్థులు వస్తున్నారు. ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలలపై మోజు అధికం కావటంతో ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య బాగా తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం ఆ పాఠశాలలో తొమ్మిదిమంది విద్యార్థులే ఉన్నారు. వీరికి ఓ ప్రధానోపాధ్యాయురాలు, ఓ ఉపాధ్యాయురాలు పాఠాలను బోధిస్తున్నారు. కొండప్రాంతమైన అక్కడ పనిచేసేవారికి యేడాదికి ఒక మారు రొటేషన్ పద్ధతిలో నియమిస్తున్నారు.



కల్నల్ బెన్నీక్విక్

ప్రస్తుతం తరగతి గదులు పూర్తిగా శిథిలస్థితికి చేరాయి. దీనితో పాఠశాల వరండాలోనే పిల్లలకు పాఠాలు బోధిస్తున్నారు. పైకప్పు దెబ్బతినటంతో వర్షం కురిస్తే నీరంతా లోపలే ప్రవహిస్తుంది. ఈ పాఠశాలను మరమ్మతు చేయాలని అక్కడి సంఘసేవకులు యేళ్లతరబడి అధికారులకు విజ్ఞప్తి చేస్తూనేవున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను, ఉపాధ్యాయుల సంఖ్యను పెంచేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, అప్పుడే బెన్నీక్విక్‌కు నిజమైన నివాళులర్పించినట్లవుతుందని చెబుతున్నారు.



దెబ్బతిన్న పాఠశాల పైకప్పు



ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టె

ఈ స్కూలూ బెన్నీక్విక్ స్మృతిచిహ్నమే...

ఈ విషయమై ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లావణ్య మాట్లాడుతూ కరపత్రాల పంపిణీ ద్వారా తమిళనాడు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యా పథకాలు గురించి ఇక్కడి తేయాకుతోటలలో పనిచేస్తున్న కార్మికులకు తెలియజేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కార్మికుల పిల్లలు కావండటంతో తమ సొంత ఖర్చుతోనే వారిని ఆటోలో స్కూలుకు తీసుకువస్తున్నామని చెప్పారు. తేక్కడిలో కేరళ ప్రభుత్వం నడుపుతున్న పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలు ఉన్నప్పటికీ తమిళనాడు ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా పథకాలకు ఈ పాఠశాల చక్కటి ఉదాహరణగా నిలుస్తోందన్నారు. జాన్ బెన్నీక్విక్ ముల్లై పెరియార్ ఆనకట్టను మాత్రమే నిర్మించలేదని, కార్మికుల సంక్షేమంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపారని, కనుకనే వారికి నివాసగృహాలను, వారి పిల్లలకు వారి మాతృభాష (తమిళం)లోనే పాఠాలు చెప్పేలా పాఠశాల కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. ముల్లై పెరియార్ ఆనకట్టను మాత్రమే బెన్నీక్విక్ స్మృతి చిహ్నంగా అందరూ భావిస్తున్నా, తేక్కడిలో సత్సంకల్పంతో నిర్మించిన ఈ పాఠశాల కూడా ఆయన స్మృతి చిహ్నంగా గుర్తించి, పాఠశాల మరమ్మతులకు చర్యలు చేపట్టాలని తేయాకు ఎస్టేట్‌లో పనిచేస్తున్న కార్మికులు, తమిళ వ్యవసాయ కూలీలు డిమాండ్ చేస్తున్నారు.



లావణ్య
ప్రధానోపాధ్యాయురాలు

ఉబ్బలమడుగులో నీటమునిగి యువకుడి మృతి

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉబ్బలమడుగు జలపాతంలో నీట మునిగి తమిళనాడుకు చెందిన యువకుడు మృతి చెందాడు. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉబ్బలమడుగు జలపాతానికి సోమవారం తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా తిరునత్తూరుకు చెందిన డేనియల్ కింగ్‌స్టన్ సహా ఐదుగురు స్నేహితులు విహారయాత్రకు వచ్చారు. డేనియల్ కింగ్‌స్టన్(21) స్నేహితులతో కలసి ఉబ్బలమడుగలోని ఎగువశీతలంకు వెళ్లి నీటిలో దూకాడు. లోతు ఎక్కువగా ఉండడంతో నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు నీటిలో గాలించినా ఆచూకీ దొరకలేదు. దీనిపై బీఎన్‌కండ్రిగ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథ నాయుడు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక, అటవీశాఖలకు సమాచారం అందించారు. వారి సాయంతో నీటిలో గాలించగా రాళ్ల మధ్యలో చిక్కుకునిఉన్న డేనియల్ కింగ్‌స్టన్ మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.



డేనియిల్ కింగ్‌స్టన్ (ఫైల్‌ఫొటో)

పుదుచ్చేరి జైలులో ఖైదీల ఘర్షణ

పుదుచ్చేరి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలోని సెంట్రల్ జైలులో రెండు వర్గాలకు చెందిన ఖైదీలు మంగళవారం ఘర్షణకు పాల్పడ్డారు. దీనిపై జైలు అధికారుల ఫిర్యాదు ఆధారంగా కాళాపట్టు పోలీసులు 13 మంది ఖైదీలపై కేసు నమోదు చేశారు. కాళాపట్టు ప్రాంతంలోని సెంట్రల్ జైలులో సుమారు 500 మందికి పైగా ఖైదీలున్నారు. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర బీజేపీ నేత సెందిల్‌కుమార్ హత్య కేసులో అరెస్టయిన నిత్యానందం వర్గం, పారిశ్రమికవేత్త వేలళగన్ హత్యకేసులో పట్టుబడిన రౌడీ జనా వర్గానికి చెందిన వారు తరచుగా ఈ జైలులో గొడవపడుతుండేవారని తెలిసింది. అదేవిధంగా మంగళవారం ఉదయం కూడా ఈ రెండు వర్గాల ఖైదీలు ఒకరిపై ఒకరు దాడికి దిగడంతో పలువురికి గాయాలైయ్యాయి. ఈ ఘర్షణకు సంబంధించి ఇరువర్గాల వారిపై కేసు నమోదు చేశారు.

పదేళ్ల చిన్నారిపై లైంగిక దాడి నిందితుడికి యావజ్జీవ జైలు శిక్ష

ప్యారీస్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): చెంగల్‌పట్టు జిల్లా వండలూర్ సమీపంలో మిత్రుని పదేళ్ల కుమార్తెపై లైంగిక వేధింపులకు పాల్పడిన కామాంధుడికి న్యాయస్థానం యావజ్జీవ జైలు శిక్ష విధించింది. వండలూర్ సమీపంలోని నిందితుడి (42) ఇంటికి అతని మిత్రుడి పదేళ్ల కుమార్తె వెళ్లి ఆడుకుంటుండేది. గత ఏడాది వెళ్లిన బాలికను లైంగికంగా వేధింపులకు పాల్పడి ఈ విషయం బయట చెప్పకూడదని బెదిరించినట్లు తెలిసింది. ఆ బాలిక తన తల్లిదండ్రులకు వివరించడంతో, వారి ఫిర్యాదు ఆధారంగా నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. చెంగల్‌పట్టు పోక్సో న్యాయస్థానంలో ఈ కేసు విచారణ పూర్తికావడంతో, న్యాయమూర్తి నజీమా భాను నింధితుడికి యావజ్జీవ జైలు శిక్ష విధించారు.

కిలో మల్లెపూలు రూ.4,200....!



పెరంబూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ సంతకు దిగుమతులు తగ్గడంతో పూల ధరలు ఆకాశాన్నంటాయి. కిలో మల్లెపూలు రూ.4,200 ధర పలికింది. రాష్ట్రంలోని మార్కెట్లలో ప్రధానంగా ఉన్న దిండుగల్ పూల మార్కెట్‌కు పలు జిల్లాలు, పొరుగు రాష్ట్రాల నుంచి పూలు దిగుమతవుతుంటాయి. కొద్దిరోజులుగా వర్షాలు కురవడం, దట్టమైన మంచుతో పూల ఉత్పత్తి తగ్గి మార్కెట్‌కు దిగుమతులు తగ్గడంతో వాటి ధరలు భారీగా పెరిగాయి. ఆ ప్రకారం, మల్లెపూలు కిలో రూ.4,200, ముల్లై పూలు రూ.1,100, కనకాంబరం రూ.1,000, జాజి పూలు రూ.800, ఆరణి పూలు రూ.300, బటన్ రోజ్ రూ.300, రోజా కట్ట రూ.300లకు విక్రయమవుతున్నాయి.

పుస్తకాల కోసం వివరాలు తెలపండి

ఐసిఎఫ్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉచితంగా నోటు పుస్తకాలు అందించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలు 'ఎమిస్' వెబ్‌సైట్‌లో నమోదుచేయాలని ప్రాథమిక విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ప్రాథమిక విద్యా శాఖ డైరెక్టరేట్ జారీచేసిన సర్క్యులర్‌లో.. రాష్ట్రంలో 2012-13 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ, ఎయిడెడ్ ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో 1 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాలు అందిస్తున్నామని తెలిపింది. ఆ ప్రకారం, వచ్చే విద్యా సంవత్సరం (2025-26) మొదటి సెమిస్టర్‌కు ఉచిత నోటు పుస్తకాలు అందజేసేందుకు విద్యార్థుల జాబితాను ఎమిస్ వెబ్‌సైట్‌లో నమోదుచేయాలని, ఈ వివరాలకు తాలూకా విద్యాధికారుల ద్వారా జిల్లా ప్రధాన విద్యాధికారి ధృవీకరించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'యువత' తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరణలో అతిథులు, నిర్వాహకులు

చెన్నై, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): యువత సాంఘిక ఆధ్యాత్మిక అభివృద్ధి సంస్థ (యువత చారిటబుల్ ట్రస్ట్) ఆధ్వర్యంలో 2025 తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ మంగళవారం ఘనంగా జరిగింది. యువత సంస్థ న్యాయ సలహాదారులు, సుప్రీంకోర్టు న్యాయవాది డా.ఏఎస్ పురుషోత్తం క్యాలెండర్ ఆవిష్కరించి, తొలిప్రతిని లయన్స్ క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డా.కేపీ పద్మనాభన్, యువత సలహాదారులు గుడిమెట్ల చెన్నయ్య, ఆర్.యోగప్రకాష్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్ పురుషోత్తం మాట్లాడుతూ... 2025వ సంవత్సరంలో అందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. తెలుగువారంతా నూతన సంవత్సరంలో సుఖశాంతులతో గడపాలని గుడిమెట్ల చెన్నయ్య కోరారు. తమ సంస్థ ఆరేళ్లగా పలు సాంఘీక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని యువత ట్రస్ట్ అధ్యక్షులు సీహెచ్ ముకుందరావు తెలిపారు. అలాగే, క్యాలెండర్ ముద్రణకు సహకరించిన తోట కృష్ణ, లయన్ జి.మురళికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో యువత ప్రతినిధులు ఎస్వీ సురేష్, ఆదిత్య, ఎన్వీ అఖిలేష్, సీహెచ్ రిక్కీ, చరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అతిథులను సత్కరించారు.

స్మార్ట్ మీటర్ల టెండర్లు రద్దు

పెరంబూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అదానీ సంస్థ తక్కువ ధరకు కోడ్ చేసిన నేపథ్యంలో, స్మార్ మీటర్ల కొనుగోలు టెండర్లను రాష్ట్ర విద్యుత్ బోర్డు రద్దు చేసింది. రాష్ట్రంలో విద్యుత్ బోర్డు ఉద్యోగులు ఇళ్లకు వెళ్లి మీటర్ రీడింగ్ తీసి విద్యుత్ కార్డులపై వివరాలు నమోదుచేసిన అనంతరం కార్యాలయ కంప్యూటర్‌లో పొందుపరుస్తుంటారు. కొద్దిరోజులుగా విద్యుత్ చార్జీల వివరాలను వినియోగదారుల మొబైల్ ఫోన్‌లకు ఎస్ఎంఎస్ ద్వారా పంపిస్తున్నారు. కర్మాగారాలు తదితర హై ఓల్టేజీ విద్యుత్ కనెక్షన్ మీటర్లు కమ్యూనికేషన్ పరికరాలతో అమర్చబడి బోర్డులోని సర్వర్‌కు అనుసంధానం చేసి ఉంటాయి. దీని ద్వారా నెలవారీ మానవరహిత విద్యుత్ వినియోగ ఖాతా తీసుకుంటారు. ఈ నేపథ్యంలో, గృహాల్లో విద్యుత్ వినియోగం లెక్కించేలా స్మార్ మీటర్లు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఇందుకోసం 3.03 కోట్ల విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు అమర్చే ప్రాజెక్టుకు టెండర్లు ఆహ్వానించారు. తొలివిడతగా అంతర్జాతీయ టెండర్‌లో 82 లక్షల స్మార్ట్ మీటర్ల కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించారు. ఆ ప్రకారం, వివిధ కంపెనీలు టెండర్లు వేశాయి. అందులో అదానీ సంస్థ అతి తక్కువ ధరకు టెండరు వేయడంతో, దానికే దక్కే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో, అదానీ రాష్ట్రానికి వచ్చి ముఖ్యులను కలిసినట్లు ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. అంతేగాక రాష్ట్ర ప్రభుత్వం అదానీకి అనుకూలంగా పనిచేస్తోందని పలు పార్టీలు ఆరోపిస్తున్నాయి. ఈ క్రమంలో స్మార్ట్ మీటర్ల కొనుగోలు టెండర్‌ను విద్యుత్ బోర్డు రద్దు చేసింది.

పీఎంకేకు లభించిన విజయం: అన్బుమణి

అదానీకి అప్పగించిన టెండర్ రద్దు చేయడం పీఎంకేకు లభించిన విజయమని ఆ పార్టీ అధ్యక్షుడు అన్బుమణి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... స్మార్ట్ మీటర్ల కొనుగోలులో నిబంధనలు ఉల్లంఘించారని ఆరోపణలున్నాయన్నారు. 2013 ఆగస్టులో టెండర్లు ఆహ్వానించారని, ఈ మధ్యంతర కాలంలో స్మార్ట్ మీటర్ల ధరలు ఎంత తగ్గి వుంటాయో అర్థం చేసుకోవచ్చన్నారు. పుదుచ్చేరిలో మీటరు రూ.6,169 అని పేర్కొన్నారని, టెండర్లు విడుదల చేసిన ఏడాది అనంతరం ధర రూ.4,000 తగ్గిందని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.15,000 చొప్పున 80 లక్షల మీటర్లు కొనుగోలు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఈ టెండర్లు రద్దు చేయాలని తాము ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నామని, ప్రస్తుతం విద్యుత్ బోర్డు ప్రకటన తమ పార్టీకి లభించిన విజయమని అన్బుమణి పేర్కొన్నారు.

అవినీతి కార్పొరేటర్లకు పదవీ గండం !

చెన్నై, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌లో అవినీతి, అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎనిమిది మంది కార్పొరేటర్లను డిస్మిస్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. కొంతమంది కార్పొరేటర్లు తమ పలుకుబడి ఉపయోగించి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, కాంట్రాక్టర్లను బెదరిస్తున్నారని ఆరోపణలు, ఫిర్యాదులు అధికంగా వస్తుండటంతో ప్రభుత్వం దీనిపై చర్యలు చేపట్టడానికి సిద్ధమవుతోంది. అదే సమయంలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న కార్పొరేటర్ల వివరాలను కూడా రహస్యంగా సేకరించింది. ముఖ్యంగా చోళింగనల్లూరు, పెరుంగుడి, ఆలందూరు, మాదవరం జోన్లలో ఇలాంటి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని నగరపాలక మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. వీరి ఆగడాలపై ఇంటెలిజెన్స్ అధికారులు, కార్పొరేషన్ ఉన్నతాధికారులు సీఎం స్టాలిన్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. అన్ని వివరాలను తెలుసుకున్న తర్వాత ఆ కార్పొరేటర్లపై చర్యలు తీసుకోమంటూ ఆయన ఆదేశాలిచ్చారని కూడా చెబుతున్నారు. ఆ నేపథ్యంలో గత ఆగస్టులో డీఎంకేకు చెందిన ముగ్గురు కార్పొరేటర్లు, అన్నాడీఎంకేకు చెందిన ఓ కార్పొరేటర్‌కు నోటీసులు జారీ అయ్యాయి. ఆ నలుగురిపై వచ్చిన ఆరోపణలకు సంజాయిషీ ఇవ్వాలని ఆ నోటీసులో ఆదేశించారు. ఆ నలుగురు కార్పొరేటర్లు రాతపూర్వకంగా ఇచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేదని అధికారులు తెలిపారు. ఈ పరిస్థితుల్లో తాజాగా మరో నలుగురు కార్పొరేటర్లకు కూడా నోటీసులు పంపారని తెలుస్తోంది. వీరిలో ముగ్గురు డీఎంకే కార్పొరేటర్లు, మరొకరు అన్నాడీఎంకే కార్పొరేటర్ అని చెప్పారు. ఈ నలుగురు సంజాయిషీ నోటీసులకు ఇచ్చే సమాధానాలను బట్టి వారిపై తదుపరి చర్యలు తీసుకోవాలని నగరపాలక మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. రాష్ట్ర నగరపాలక పురపాలక స్థానిక సంస్థల చట్టం 52వ సెక్షన్ ప్రకారం కార్పొరేటర్‌ను పదవి నుండి తొలగిస్తే కార్పొరేషన్ ఎన్నికలు వచ్చేంత వరకు, లేదా బర్తరఫ్‌గురైన తేదీ నుంచి యేడాది పాటూ ఆ కార్పొరేటర్ ఎన్నికలో పోటీ చేసే అర్హత కోల్పోతాడు. ఈ పరిస్థితులలో డీఎంకేకు చెందిన ఆరుగురు కార్పొరేటర్లు, అన్నాడీఎంకేకు చెందిన ఇద్దరు కార్పొరేటర్లపై త్వరలో వేటు పడనుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

